క్లుప్తంగా

ఎమ్మెల్యే వనమాకు స్వాగతం



స్వాగతం పలికేందుకు వెళ్తున్న నాయకులు

పాల్వంచ: సుప్రీంకోర్టులో స్టే వచ్చిన అనంతరం ఎమ్మెల్యే వనమా గురువాం కొత్తగూడెం వస్తున్న సందర్భంగా పాల్వంచ నుంచి సుజాతనగర్‌కు భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, ద్విచక్రవాహనాలపై వెళ్లి స్వాగతం పలికారు. కొత్వాల శ్రీనివాసరావు, మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, ఎంపీపీ సత్యవతి, విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా భిక్షం



భిక్షంను సన్మానిస్తున్న ఎంపీపీ, డైరెక్టర్లు

జూలూరుపాడు: స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడిగా చీమలపాటి భిక్షం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత అధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డిని తొలగించి, కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని వరంగల్ ట్రిబ్యునల్ కోర్టు ఈనెల 7న తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న చీమలపాటి భిక్షంను అధ్యక్షుడిగా నియమిస్తూ డీసీఓ ఎస్.వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భిక్షంకు సొసైటీ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఘనస్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌కు సన్మానం



రఘును సన్మానిస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ డిస్ట్రిక్ట్ ఫోరం సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అశోక్ చౌహాన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హోంగార్డుకు..

కొత్తగూడెంటౌన్: భద్రాచలం యూనిట్‌లో హోంగార్డుగా పని చేస్తున్న ఎస్.తమ్మయ్యను గురువారం ఎస్పీ డాక్టర్ వినీత్ ఘనంగా సన్మానించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డ్స్‌కు అండగా ఉంటామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): 23 సంవత్సరాలుగా పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి శాఖలో గోపాలమిత్రలుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంకను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాము అందిస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు. శ్రీనివాసరావు, కె.ప్రసాద్, జి.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ నరేష్‌బాబు పాల్గొన్నారు.

గడువు పెంచండి

ఇల్లెందురూరల్: సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని సీపీఎం మండల కార్యదర్శి నబీ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం దరఖాస్తుదారులతో కలిసి ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ బాలరాజుకు అందజేశారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం మూడు రోజులు మాత్రమే గడువు ఇవ్వడంతో సంబంధిత ధృవీకరణ పత్రాలు లేక పేదలు దరఖాస్తు చేసుకోలేక పోతున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ కౌన్సిలర్ల బృందం గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. మొదట పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. మాట్లాడుతూ.. ప్రధానంగా మంచినీటి సమస్య పరిష్కరించాలని, కోతుల, కుక్కల బెడద నివారించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబులెన్స్ మంజూరు

టేకులపల్లి: ఎట్టకేలకు టేకులపల్లి మండలానికి 108 అంబులెన్స్ మంజూరయింది. ఇటీవల సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 108 అంబులెన్సులను వివిధ మండలాలకు కేటాయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టేకులపల్లిలో ఉన్నది మరమ్మతులకు చేరుకోవడంతో నూతన వాహనాన్ని అందజేశారు.

నిబంధనలకు తిలోదకాలు

ప్రజలను సమన్వయం చేసి అందరికీ సమాచారం అందించి ఆసక్తి ఉన్నవారిని సభ్యులుగా ఎంపిక చేయాల్సిన అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. చివరికి చేపల సొసైటీ సభ్యుల ఎంపిక వివాదాస్పదంగా మారింది. ఎవరికీ తెలియకుండా సొసైటీ సభ్యులను ఎలా ఎన్నుకున్నారని మత్స్యశాఖ అధికారులను గ్రామస్తులు నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకొచ్చింది.

- ప్రచారం లేకుండానే మత్స్య సొసైటీ సభ్యుల ఎంపిక
- ఉన్నతాధికారులకు స్థానికుల ఫిర్యాదులు
- పోచారంతండాలో చర్చనీయాంశంగా చేపల చెరువులు



పోచారంతండాలోని యదళ్లచెరువు

ఇల్లెందురూరల్: గతంలో మత్స్యశాఖ ఆధీనంలో ఉన్న చెరువులకు మాత్రమే చేపల సొసైటీలు ఉండేవి. ఇదిలా ఉండగా గ్రామపంచాయతీ పర్యవేక్షణలో వేలంపాట నిర్వహించే చెరువులను కొన్నింటిని నూతన గ్రామపంచాయతీలు ఏర్పడినప్పుడు మత్స్యశాఖకు అప్పగించారు. ఇలా పోచారం గ్రామపంచాయతీ యదళ్ల చెరువు, బందంకుంట చెరువులను మత్స్యశాఖకు అప్పగించారు. ఆయా చెరువులకు సొసైటీ నిర్మాణం కోసం మత్స్యశాఖ 2021లో ప్రక్రియ ప్రారంభించింది. ఆ చెరువులను మత్స్యశాఖకు అప్పగించినందున గ్రామసభ, పెసా తీర్మానం అవసరం లేకుండా పోయింది. ఇక సొసైటీ సభ్యులుగా ఉండేందుకు ఆసక్తి కలిగిన వారికి సమాచారం ఇచ్చేందుకు గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి పర్యవేక్షణలో టమకా వేయించాల్సి ఉంటుంది. ఈ సమాచారంతో నిర్దేశించిన చెరువు వద్ద సొసైటీ సభ్యులుగా ఉండేందుకు అవసరమైన పరీక్షలను మత్స్యశాఖ అధికారులు నిర్వహించి అర్హత కలిగిన వారిని సొసైటీ సభ్యులుగా ఎంపిక చేస్తారు.

ఏం జరిగిందంటే..

సొసైటీ సభ్యుల ఎంపికకు గ్రామపంచాయతీ, మత్స్యశాఖల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సభ్యులను ఎన్నుకోవాలంటే టమకా ద్వారా ప్రజలందరికీ సమాచారం ఇవ్వాలని అధికారులు చెబుతుండడగా.. తమకు 23 మంది సభ్యులతో కూడిన జాబితాను మత్స్యశాఖ అధికారులు పంపించారని, వారికి మాత్రమే సమాచారం ఇవ్వాలని ఆదేశించినందునే తాము టమకా వేయించకుండా వ్యక్తిగత సమాచారం అందించామని గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి స్పష్టం చేస్తున్నారు. కానీ 2022 మేలో చేపల సొసైటీ నిర్మాణ ప్రక్రియ పూర్తిచేసినట్లు మత్స్యశాఖ అధికారులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో ఎంపిక ప్రక్రియ వివాదాస్పదంగా మారింది.



సర్పంచ్, గ్రామస్తుల సమావేశం (ఫైల్)

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు..

పోచారంతండా గ్రామపంచాయతీలో చేపల సొసైటీ సభ్యుల ఎంపికలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ గ్రామంలోని కొందరు నేరుగా మత్స్యశాఖ ఉన్నతాధికారులకు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఏకపక్షంగా సొసైటీ ఎంపిక పూర్తిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం సొసైటీని రద్దు చేసి కొత్తగా సంఘాలన్ని ఎన్నుకోవాలని కోరారు.

ఏకపక్షంగా ఎన్నిక జరిగింది



గ్రామపంచాయతీకి సంబంధించిన చేపల సొసైటీ కమిటీ ఎన్నిక ఏకపక్షంగా నిర్వహించారు. గ్రామంలో టమకా వేయించి అందరికీ సమాచారం ఇవ్వాల్సిన గ్రామపంచాయతీ తన బాధ్యతను విస్మరించింది. దీంతో ఆసక్తి ఉన్నవారికి కమిటీ సభ్యత్వం పొందలేకపోయారు.

– జర్పుల బాబులాల్, పోచారంతండా

అధికారుల ఆదేశాల మేరకే..



గ్రామపంచాయతీ పరిధిలో రెండు చెరువుల చేపల సొసైటీ ఎన్నిక ప్రక్రియను కావాలనే వివాదాస్పదం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా వారు పంపిన జాబితాలో సభ్యులకు మాత్రమే సమాచారం అందించాం. దీంతో అందరికీ సమాచారం ఇవ్వాల్సి రాలేదు.

– వాంకుడోత్ శ్రీనివాస్, సర్పంచ్, పోచారంతండా

నిబంధనల ప్రకారమే..

నిబంధనలకు అనుగుణంగా సొసైటీ కమిటీ ఎన్నిక చేపట్టాం. సభ్యుల ఎంపిక కోసం గ్రామాంలో టమకా వేయించాలని సర్పంచ్, కార్యదర్శులకు సమాచారం ఇచ్చాం. దీనికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు కూడా మాకు ఇచ్చారు. ఆ తరువాతే చెరువు వద్ద నైపుణ్య పరీక్షలు పెట్టి సభ్యులను ఎంపిక చేశాం. గ్రామంలో కొంతమందికి వ్యక్తిగతంగా ఆరోపణలు సరికాదు.

– వీరన్న, మత్స్యశాఖ జిల్లా అధికారి

బీసీ బంధు చెక్కుల పంపిణీ

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి చేయూత అందించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన బీసీ బంధు చెక్కులను ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ పంపిణీ చేశారు. గురువారం వైరా నియోజవర్గ కేంద్రంలోని ఎస్‌వీఎస్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో జూలూరుపాడు మండలానికి చెందిన 50 మంది బీసీ లబ్ధిదారులకు రూ.1లక్ష చెక్కులను ఎమ్మెల్యే రాములు నాయక్ అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఈడీ జ్యోతి, జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు, మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, చౌడం నరసింహారావు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

సీఎస్ఆర్ అమలు చేయండి



రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ బూడిద కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో సీఎస్ఆర్ పాలసీ కింద అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఈ నెల 2వ తేదీన పాండురంగాపురం ఉపసర్పంచ్ నగేష్, బీజేపీ జనరల్ సెక్రటరీ దాసరి రమేష్ కలెక్టర్ ప్రియాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ దత్తత గ్రామాల్లో అభివృద్ధి పనులతోపాటు మెడికల్ క్యాంపులను నిర్వహించాలని స్పెషలాఫీసర్ సీతారామ్‌నాయక్‌ను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన పాండురంగాపురం గ్రామానికి వచ్చారు. తుమ్మల చెరువు రహదారి, కేటీపీఎస్ జెడ్పీ స్కూల్‌లో సైకిల్‌స్టాండ్, వాటర్ ప్లాంట్, దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. సీఎస్ఆర్ పాలసీ కింద రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోని రోడ్ల నిర్మాణం చేపడతామని స్పెషలాఫీసర్ తెలిపారు. పొల్యూషన్ బోర్డు ఈఈ రవీందర్, కేటీపీఎస్ ఎస్ఈ యుగపతి పాల్గొన్నారు.

ముమ్మరంగా వైద్య శిబిరాలు

జూలూరుపాడు: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం అనంతారం హెల్త్ సబ్ సెంటర్ పరిధి సురారం గ్రామంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్, అంటువ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెచ్‌వీ రాధిక, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం రాజమ్మ, అంగన్‌వాడీ టీచర్ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ ఆదేశానుసారం సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం సంపత్ నగర్ గ్రామంలో, గంగారం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 63 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి యాంటీ లార్వా మరియు టీమోఫాస్ చల్లించడం, స్పేస్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, పల్లె దవాఖానా వైద్యురాలు శైలజ, సూపర్‌వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, హెచ్ఎం వాల్యా, హెల్త్ అసిస్టెంట్ ధనసరి రాంబాబు, సురేందర్ ఏఎన్ఎంలు మానస, అరుణాదేవి ఆశా కార్యకర్తలు లక్ష్మి, సుశీల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

జూలూరుపాడు: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులపై దాడికి పాల్పడిన డీసీపీ వెంకటేశ్వర్లును తక్షణమే డిస్మిస్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జూలూరుపాడులో రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాలు, మీడియాను విద్యాసంస్థల్లోకి రావద్దంటూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని శాంతియుతంగా సెక్రటేరియట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులపై పోలీసులు దాడి చేయడం దారుణమన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులపై దాడి చేసిన డీసీపీ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి కనబరుస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో గార్లపాటి పవన్ కుమార్, గుగులోత్ వంశీ, ఎస్కే నాగుల్‌మీరా, వల్లమల్ల చందర్‌రావు, ఎస్కే చాంద్‌పాషా, బోడా అభిమిత్ర, పసుపులేటి పవన్, కె.హనుమంతరావు, అభి, అనిల్‌కుమార్, గణేష్, నవీన్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయం పరిధిలోని ఖాళీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఎంపీపీ చీమల నాగరత్నమ్మ గురువారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకొని కార్యాలయానికి ఆదాయం సమకూర్చుకునేందుకు ఈ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ప్రమోద్, ఎంపీడీఓ బాలరాజు, ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి..

మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ ధనసరి స్రవంతి గురువారం శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.20 లక్షలు వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని కోరారు.ఉపసర్పంచ్ ఉండం రాకేష్, సనప కల్యాణి, ఏపె రమాదేవి, సింగారపు శ్రీను పాల్గొన్నారు.

బురద నీళ్లు తాగేదెలా?

కొత్తగూడెంఅర్బన్: కిన్నెరసాని నుంచి సరఫరా చేస్తున్న నీళ్లు బురదమయంగా ఉండడంతో తాగలేక ప్రజలు అవస్థ పడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం ప్రజలకు కిన్నెరసాని నుంచి నీరు సరఫరా చేస్తున్నా, పైపులైన్ లీకేజీలతో బురదగా వస్తున్నాయని తెలిపారు. ఇకనైనా లోపాలను సరిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. గంధం మల్లికార్జునరావు, నిరంజన్, మాలోత్ వీరు నాయక్, అల్లకొండ శరత్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

జూలూరుపాడు: జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక పశు వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడులో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జూలూరుపాడు పశు వైద్యాధికారి డాక్టర్ బి.బద్దులాల్ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు నోటి వెంట సొంగ కారడం, గిట్టలకు, నోట్లో పుండ్లు పడి తీవ్రజ్వరంతో బాధపడతాయన్నారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

పాల్వంచ: పట్టణంలోని ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం (భవిత కేంద్రం)ను జిల్లా సమీకృత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కే.సైదులు తనిఖీ చేశారు. గురువారం కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. మూడేళ్ల తనూష ఆరోగ్య పరిస్థితి, మార్పును అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో రిసోర్స్ పర్సన్ల ద్వారా పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు దుర్గ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

టేకులపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ సేన జిల్లా నాయకులు మాళోతు శివ నాయక్, డి.నాగేంద్రనాయక్ కోరారు. ఈ మేరకు గురువారం టేకులపల్లికి చెందిన సంఘం నాయకుల బృందం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ ద్వారా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. భద్రాద్రి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, టేకులపల్లి కేజీబీవీ కాలేజీ భవనం నిర్మించి మూడేళ్లు అవుతున్నా నేటికీ విద్యుత్ సౌకర్యం లేదని దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 23 ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కమ్ గెస్ట్ ఉద్యోగులందరికీ సమాన వేతనం అమలు చేయాలని, ఆశ్రమ, గురుకుల, కేజీబీవీ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాందాస్ నాయక్, కిషోర్, కోటి పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం బొల్లేరుగూడెం హైస్కూల్ నుంచి తహసీల్దార్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అజిత్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేయలేదన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో తరగతులు జరగడం లేదన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో గుండాల సుజన్, రాజు, నవీన్, పవన్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణ

జూలూరుపాడు: గృహలక్ష్మి పథకం కోసం 3,150 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీల మహిళలు గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు.

సుజాతనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఇంటి కల నెరవేర్చేందుకు ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల గడువు గురువారంతో ముగిసింది. మంగళ, బుధ, గురువారాల్లో మొత్తం మూడు రోజుల పాటు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 20 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 2,250 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

టేకులపల్లి: మండలంలో బుధవారం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అయింది. గురువారం చివరి రోజు కావడంతో దరఖాస్తుల వెల్లువ కొనసాగింది. కొందరు జిరాక్స్ సెంటర్ల యజమానులు దరఖాస్తు ఫారంలను అధిక ధరలకు విక్రయిస్తుండటంతో ప్రజల ఆర్థిక భారాన్ని గమనించిన హరిప్రియ హరిసింగ్ నాయక్ యువసేన అధ్యక్షుడు జాటోత్ నరేష్ నాయక్ సుమారు రెండు వందలకు పైగా దరఖాస్తులు తెచ్చి టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉచితంగా పంపిణీ చేశారు.

నిబంధనలు సడలించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎన్డీ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గృహలక్ష్మి పథకానికి నిబంధనలను సడలించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంలో ప్రభుత్వం కులం, ఆదాయం ఆధారంగా అనేక నిబంధనలు విధించిందని, దీంతో గడువు ముగుస్తుందనే గందరగోళ పరిస్థితులలో చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయినట్లు చెప్పారు. సొంత రాష్ట్రం సిద్ధించినా ఇంటిస్థలం కూడా లేని చాలామంది పేదలు ఉన్నారని వారందరికీ స్థలాలతోపాటు ఇండ్లు కూడా కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థలం ఉన్నవారికి రూ.3లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని కానీ, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం రూ.6లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరంతరంగా ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, ఎన్డీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు, కుంజ కృష్ణ, డివిజన్ నాయకులు కొండపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఇల్లెందురూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్ ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండలశాఖ అధ్యక్షుడు ధరావత్ రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలివ్వాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే వంట కార్మికులకు పెంచిన రూ.2 వేల వేతనం వెంటనే వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని మిడ్ డే మీల్స్ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ సూపరింటెండెంట్ జ్యోతికి గురువారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. పాఠశాలల్లో సంవత్సరాల తరబడి పని చేస్తున్న వంట కార్మికులను తొలగించి కొత్త వారిని నియమించడం నిలిపివేయాలన్నారు.

ఘనంగా టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

టేకులపల్లి: టీఎస్ యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడకలు గురువారం టేకులపల్లి ఘనంగా జరుపుకున్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి సంఘం పతాకాన్ని ఎగుర వేశారు. భూక్యా కిషోర్‌సింగ్, మంగతాయి, నరసింహారావు, మాన్సింగ్, రాంజీ, సుజాత, రాంచందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ధ్వంసం

జూలూరుపాడు: కాకర్ల గ్రామానికి చెందిన కాలసాని నాగమణి పొలం చుట్టూ ఉన్న సిమెంట్ పోల్స్, ఫెన్సింగ్ ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ నెల 1న నాగమణి– నరసింహారావు దంపతులు పొలంలో పనిచేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన అల్లాడి నరసింహారావు, అల్లాడి యాలాద్రి తోపాటు మరికొందరు వచ్చి సిమెంట్ పోల్స్, ఫెన్సింగ్ ధ్వంసం చేశారు. దంపతులపై బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: రహదారిపై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీ కొట్టిన సంఘటనలో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రంగాపురం గ్రామ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న బానోతు బాలును ఈనెల 6న పాల్వంచ వస్తున్న లారీ ఢీకొనడంతో కిందపడి గాయాలయ్యాయని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చౌటుప్పల్‌కు చెందిన లారీ డ్రైవర్ ఎల్లంకి రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

సింగరేణిలో పైపు చోరీ..

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వాటర్ షెడ్డులో రూ.పదివేలు విలువ చేసే పైపు గురువారం చోరీకి గురైంది. ఎస్అండ్‌పీసీ అధికారి టంగుటూరి సంపత్ ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్విట్ మోదీ.. సేవ్ ఇండియా

టేకులపల్లి: దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రెండు రోజుల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు రెండో రోజు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో టేకులపల్లి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. కుంజ హైమావతి అధ్యక్షతన జరిగిన ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాల చట్టాన్ని మెరుగుపరచాలని, దేశీయంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలను పెంచాలన్నారు. కనీస పెన్షన్ రూ.10వేలు అమలు చేయాలని, కార్మిక, ఉద్యోగ వర్గానికి భద్రత ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్‌క అప్పజెప్పొద్దని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో అత్యంత దారుణమైన సంఘటనలు జరుగుతున్నా ప్రధాని నోరు మెదపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోగ్గెల రాంబాయి, కల్తి వెంకటరమణ, పూనెం శిరోమణి, జర్పుల కమలాబాయి, ఈసం అనసూర్య, మోకాళ్ల బాయమ్మ, బాదావత్ సుజాత, ఇస్లావత్ శారద పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: క్విట్ మోదీ..సేవ్ ఇండియా నినాదంతో కార్మిక సంఘాల నాయకులు గురువారం తహసీల్ ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. కనీస వేతన చట్టాన్ని మెరుగుపర్చాలని, దేశీయంగా అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నబీ, వెంకటమ్మ, బందం నాగయ్య, యాకూబ్‌షావలీ, సారంగపాణి, దేవరకొండ శంకర్, మోహన్‌రావు, మల్లెల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.